RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:71 | ఫిబ్రవరి 22, 2026 | వెల: రూ.3-00



2లో

**ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అరెస్టు**

కామారెడ్డి ఘటన నేపథ్యంలో అదుపులోకి..

- దేవాలయాలే లక్ష్యమని నిఘా వర్గాల సమాచారం
- ఎర్రకోట, చాందినీ చౌక్ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత
- ఇటీవల పాకిస్థాన్ పేలుడు ఘటనకు ప్రతీకారంగా..
- దేశవ్యాప్తంగా అప్రమత్తం చేసిన కేంద్రం

# ఢిల్లీకి ఉగ్ర ముప్పు!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి ఉగ్ర ముప్పు పొంచి ఉందన్న నిఘా హెచ్చరికలతో భద్రతా వ్యవస్థ అప్రమత్తమైంది. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యిబా దేశంలోని ప్రముఖ ధార్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ముఖ్యంగా ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లోని దేవాలయాలపై దాడుల యత్నం ఉండొచ్చని హెచ్చరించడంతో హై అలర్ట్ ప్రకటించారు. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఓ దేవాలయంపై పేలుడు పదార్థాలతో దాడి చేయాలని వ్యూహం

మిగతా 2వ పేజీలో..



2లో




గడువు ముగిసిన మందులివ్వడంతో

## ఆరు నెలల శిశువు మృతి

- సన్ సిటీ పరిధిలోని క్రియాన్స్ ఆసుపత్రి నిర్లక్ష్యం
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- హైదరాబాద్‌లో విషాద ఘటన

2లో



డిజిటల్ అరెస్టు పేరుతో

## రూ.49 లక్షలు కాజేశారు!

- విజయవాడలో రిటైర్డ్ ఉద్యోగి నుంచి వసూలు
- ముందే హెచ్చరించినా వినని బాధితుడు
- అప్రమత్తతతో బయటపడిన ఉయ్యూరు వృద్ధ దంపతులు

2లో




# అన్నదాత అరిగోస!

## కన్నీళ్లు తెప్పిస్తున్న యూరియా!

ఓ వైపు యాప్ కష్టాలు.. మరో వైపు దళారుల దగా

- ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల మాయాజాలం
- ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు యూరియా
- ఏజెంట్లను నియమించుకుని అధిక ధరలకు విక్రయం
- స్మార్ట్‌ఫోన్లు లేక.. బుక్ చేయడం రాక రైతుల అవస్థలు
- స్టాక్ రాగానే నిమిషాల్లోనే సరుకు మాయం
- చక్రం తిప్పుతున్న హోల్‌సేల్ డీలర్లు
- ఎరువులు అందక పంట నష్టపోతున్న రైతన్నలు
- పాత పద్ధతిలోనే ఇవ్వాలంటూ డిమాండ్
- లేకుంటే యాప్‌ను సులభతరం చేసి, దళారుల బెడద తప్పించాలంటూ వేడుకోలు

2లో

**వేద న్యూస్, ఫోకస్ టీం**

సాగు క్షేత్రంలో రైతన్నకు యూరియా కన్నీటిని తెప్పిస్తోంది. పారదర్శకత పేరుతో ప్రభుత్వం తెచ్చిన ఫర్టిలైజర్ యాప్ అన్నదాతల పాలిట గుదిబండగా మారుతుంటే, దళారులకు మాత్రం అది కాసుల వర్షం కురిపించే సాధనమైంది. టెక్నాలజీ తెలియని అమాయక రైతుల పరిస్థితిని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు వ్యాపారులు, పక్కా స్కెచ్‌తో యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. రికార్డుల్లో లేని స్టాక్‌ను రాత్రికి రాత్రే తరలిస్తూ అక్రమ ఆదాయానికి తెరలేపారు. గ్రామాల్లో ఏజెంట్లుగా అవతారమెత్తిన దళారులు, రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలు ముందే చేజిక్కించుకుని, యాప్‌లో కొంతమంది పేరిట వెంటనే బుక్ చేసి సామాన్య రైతుకు చుక్కలు చూపిస్తున్నారు. ప్రభుత్వ ధరను తుంగలో తొక్కి, ఒక్కో బస్తాపై వెయ్యి రూపాయల వరకు వసూలు చేస్తూ పేద రైతుకు చుక్కలు చూపిస్తున్నారు. పంటలు పసుపు రంగులోకి మారి ఎండిపోతున్నా.. ఎరువులు అందక దిగుబడి పడిపోతున్నా అధికారుల నిర్లక్ష్యం వీడటం లేదు.



## గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు మంజూరు చేయాలి

- కనీసం ఈ ఏడాదిలో మూడు లక్షల ఇండ్లు ఇవ్వాలి
- పేదల సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం
- కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి మంత్రితో మంత్రి పొంగులేటి భేటీ

2లో

టీపీసీసీ బాధ్యతలు స్వీకరించినప్పుడు

## పార్టీ పరిస్థితి క్లిష్టం

- భిన్నాభిప్రాయాలకు కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉంటుంది
- కష్టపడి పనిచేసిన వారికి అవకాశాలు ఖాయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం

2లో



### గడువు ముగిసిన మందులివ్వడంతో

# ఆరు నెలల శిశువు మృతి

- సన్ సిటీ పరిధిలోని క్రియాన్స్ ఆసుపత్రి నిర్లక్ష్యం
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- హైదరాబాద్‌లో విషాద ఘటన

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ నగరంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. గడువు ముగిసిన మందులు ఇవ్వడంతో ఆరు నెలల శిశువు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ సంఘటన సన్ సిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జరిగినట్లు సమాచారం. తమ కుమారుడికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని క్రియాన్స్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఇచ్చిన మందుల తర్వాత శిశువు ఆరోగ్యం మరింత విషమించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పరిస్థితి క్షీణించడంతో బాలుడు ప్రాణాలు కోల్పోయినట్లు వారు వాపోయారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మరణించాడని ఆరోపిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గడువు ముగిసిన మందులు ఇచ్చినట్లుగా ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, వైద్య రికార్డులు, మందుల నమూనాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిజానిజాలు తేలిన అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### డిజిటల్ అరెస్టు పేరుతో

# రూ.49 లక్షలు కాజేశారు!

- విజయవాడలో రిటైర్డ్ ఉద్యోగి నుంచి వసూలు
- ముందే హెచ్చరించినా వినని బాధితుడు
- అప్రమత్తతతో బయటపడిన ఉయ్యూరు వృద్ధ దంపతులు

**వేద న్యూస్, విజయవాడ**

డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధికారులు ఎన్ని సార్లు హెచ్చరించినా కొందరు బాధితులు మోసగాళ్ల మాటలు నమ్మి భారీ మొత్తాలు కోల్పోతున్నారు. తాజాగా విజయవాడలో ఓ విశ్రాంత ఉద్యోగి నలభై తొమ్మిది లక్షల రూపాయలు మోసగాళ్లకు బదిలీ చేసి నష్టపోయిన ఘటన కలకలం రేపుతోంది. విజయవాడలో నివసిస్తున్న ఓ స్టీల్ ప్లాంట్ విశ్రాంత ఉద్యోగికి ఈడీ అధికారులు మాట్లాడుతున్నామని చెబుతూ కాల్ వచ్చింది. మీపై కేసులు ఉన్నాయని, కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు చెల్లించాలని బెదిరించారు. యూనిఫాంలో వీడియో కాల్ చేసి నమ్మించే ప్రయత్నం చేశారు. భయాందోళనలకు గురైన బాధితుడు తన ఖాతాలోని నిధులను ఉపసంహరించేందుకు బ్యాంకుకు వెళ్లాడు. అనుమానం వచ్చిన బ్యాంకు అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తొలి దశలో భారీ లావాదేవీ నిలిచిపోయింది. పోలీసులు డిజిటల్ అరెస్టు అనే పద్ధతి ఎక్కడా లేదని అవగాహన కల్పించారు. అయితే కొద్ది రోజుల తర్వాత మోసగాళ్లు మళ్లీ సంప్రదించడంతో బాధితుడు మరో బ్యాంకులో ఖాతా తెరచి నలభై తొమ్మిది లక్షల రూపాయలు బదిలీ చేశాడు. బ్యాంకు సిబ్బంది ప్రశ్నించినా తెలిసిన వ్యక్తికే పంపిస్తున్నానని చెప్పి లావాదేవీ పూర్తి చేశాడు. అనంతరం మోసపోయిన విషయం గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా కృష్ణా జిల్లా ఉయ్యూరులో వృద్ధ దంపతులను లక్ష్యంగా చేసుకున్న మోసగాళ్ల ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అవగాహన కార్యక్రమాల వల్ల వారు అప్రమత్తంగా వ్యవహరించి పోలీసులకు సమాచారం అందించారు. ముంబై క్రైమ్ బ్రాంచ్, అమలు సంస్థలు, కస్టమ్స్, కేంద్ర దర్యాప్తు సంస్థ పేరుతో ఎవరైనా ఫోన్ చేసి ఆధార్, సిమ్ కార్డులు నేరాల్లో ఇరుక్కున్నాయని బెదిరిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా సహాయక నంబరు ఒక తొమ్మిది మూడు సున్నాకు సమాచారం ఇవ్వాలని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తతే ఏకైక ఆయుధమని అధికారులు హెచ్చరిస్తున్నారు. అత్యాశ, భయం, అవగాహన లోపం వల్లే మోసగాళ్ల వలలో పడుతున్నారని పేర్కొంటున్నారు.

## యూరియా కోసం రైతుల ధర్నా

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి**

యూరియా సరఫరాను పాత విధానంలోనే కొనసాగించాలని, కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. కోఆపరేటివ్ సొసైటీ ఎదుట నార్కెట్పల్లి–అద్దంకి ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేయాలంటే స్మార్ట్ ఫోన్లు అవసరమవుతాయని, తమ వద్ద అలాంటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సరైన విధంగా యూరియా సరఫరా చేయడం లేదని విమర్శించారు. సమాచారం అందుకున్న ఏవో కిషోర్ నాయక్, ఏఈఓ నితిన్, ఎస్సై వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.



# అన్నదాత అరిగోస!

## కన్నీళ్లు తెప్పిస్తున్న యూరియా!




- ఓ వైపు యాప్ కష్టాలు... మరో వైపు దళారుల దగా
- ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపుల మాయాజాలం
- ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా బ్లాక్ మార్కెట్‌కు యూరియా
- ఏజెంట్లను నియమించుకుని అధిక ధరలకు విక్రయం
- స్మార్ట్‌ఫోన్లు లేక.. బుక్ చేయడం రాక రైతుల అవస్థలు
- స్టాక్ రాగానే నిమిషాల్లోనే సరుకు మాయం
- చక్రం తిప్పుతున్న హోల్‌సేల్ డీలర్లు
- ఎరువులు అందక పంట నష్టపోతున్న రైతన్నలు
- పాత పద్ధతిలోనే ఇవ్వాలంటూ డిమాండ్
- లేకుంటే యాప్‌ను సులభతరం చేసి, దళారుల బెడద తప్పించాలంటూ వేడుకోలు

**వేద న్యూస్, ఫోకస్ టీం**

రాష్ట్రంలో అన్నదాతల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది. ఎంతో ఆశతో సాగు చేపట్టిన రైతులకు ఇప్పుడు యూరియా కన్నీళ్లు మిగిలిస్తోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనలు క్షేత్రస్థాయిలో దళారులకు వరంగా, సామాన్య రైతులకు శాపంగా మారాయి. యూరియా పంపిణీలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్ విధానం ఇప్పుడు ప్రైవేటు వ్యాపారుల అక్రమ సంపాదనకు ఒక అస్త్రంగా మారింది. ప్రభుత్వం పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ ఇప్పుడు సామాన్య రైతులకు ఇబ్బందులు కలిగిస్తోంది. వరి సాగు చేసిన రైతులు యూరియా కోసం స్మార్ట్ ఫోన్ల చుట్టూ తిరగాల్సి రావడం విచారకరం. టెక్నాలజీ తెలియని చాలా మంది రైతుల వద్ద స్మార్ట్ ఫోన్లే లేవు. ఒకవేళ ఉన్నా, అందులో బుకింగ్ చేయడం ఎలాగో తెలియక వారు ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితిని అదునుగా చేసుకున్న దళారులు, రైతుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకుంటున్నారు.

### ఆన్‌లైన్ నమోదులో గోల్‌మాల్..

ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణదారులు పక్కా ప్రణాళికతో యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. దుకాణానికి వచ్చిన లోడ్లను అధికారికంగా ఆన్‌లైన్ సిస్టమ్‌లో నమోదు చేయకుండా, స్టాక్ లేదంటూ రైతులను నమ్మిస్తున్నారు. ఒకవేళ చేసినా మొత్తం చూపెట్టడం లేదు.. రికార్డుల్లో చూపని ఈ యూరియా బస్తాలను గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో గోడౌన్ల నుంచి తరలిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన నామమాత్రపు ధరను తుంగలో తొక్కి, ఒక్కో బస్తాను వెయ్యి వరకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. పీఏసీఎస్, ఆగ్రో సెంటర్లలో కూడా కేవలం పరపతి ఉన్నవారికే సమాచారం ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### పాస్ పుస్తకాల సేకరించి..

హోల్‌సేల్ డీలర్లు తమ నెట్‌వర్క్‌ను గ్రామ స్థాయి వరకు విస్తరించారు. సాంకేతికతపై అవగాహన ఉన్న ఏజెంట్లను నియమించుకుని, రైతుల వద్ద నుంచి ముందే పట్టాదారు పాస్ పుస్తకాలను సేకరిస్తున్నారు. స్టాక్ రాగానే ఈ ఏజెంట్లు యాప్‌లో లాగిన్ అయి, సామాన్య రైతులకు అవకాశం లేకుండానే నిమిషాల్లో బుకింగ్ పూర్తి చేస్తున్నారు. ఇలా బుక్ అయిన యూరియాను రైతులకు కాకుండా, అధిక ధరలకు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నియోజకవర్గ యూనిట్ పద్ధతి ఉండటం వల్ల ఈ అక్రమాలు సులభమవుతున్నాయని, ఇది దళారులకు ఒక రక్షణ కవచంలా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### వివరాల ఆధారంగా యూరియా కేటాయించాలి..

ప్రస్తుతం జరుగుతున్న అక్రమాలను అరికట్టాలంటే మండల యూనిట్ విధానమే ఏకైక మార్గమని రైతులు స్పష్టం చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి నుంచి పంపిణీని మార్చి, సంబంధిత మండలాల్లో వరి సాగు చేసిన రైతుల వివరాల ఆధారంగా ఎరువులను కేటాయించాలనే డిమాండ్ పెరుగుతోంది. స్థానిక అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో, గ్రామల వారీగా కేటాయింపులు జరిగితేనే దళారుల ఆటలు అడ్డకట్టవేయవచ్చు. అంతేకాకుండా, యాప్ బుకింగ్ విధానంలో ఉన్న సంక్లిష్టతలను తొలగించి, పాత పద్ధతిలో ఆధార్ గుర్తింపు ద్వారా నేరుగా పంపిణీ చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

### సమస్య పరిష్కరించాలని రైతుల ఆవేదన

నాట్లు వేసి చాలా రోజులు దాటుతున్నా పంటకు సకాలంలో యూరియా అందకపోవడం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎరువులు అందక పొలాలు పసుపు రంగులోకి మారుతున్నాయి. దీనివల్ల కంకి వేసే దశలో పంట ఎదుగుదల దెబ్బతింటుంది. అప్పులు తెచ్చి సాగు చేస్తున్నం.. ఎరువుల కోసం ఇలాంటి కష్టాలు రావడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే, పంటలు చేతికి రాక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

### టీపీసీసీ బాధ్యతలు స్వీకరించినప్పుడు

# పార్టీ పరిస్థితి క్లిష్టం

- భిన్నాభిప్రాయాలకు కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉంటుంది
- కష్టపడి పనిచేసిన వారికి అవకాశాలు ఖాయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం



**వేద న్యూస్, వికారాబాద్**

తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదురైనా, నేతలందరినీ కలిసి తన ఆలోచనలను వివరించి వారిని ఒప్పించానని గుర్తుచేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలను వ్యక్తపరచడానికి ఎప్పటి నుంచో స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్‌లో లేదన్నారు. అంతర్గత విభేదాలు పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేస్తాయని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. తెలంగాణలో పార్టీ పునరుద్ధరణ అందరి కృషి ఫలితమని ఆయన పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులుగా కృషి చేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీ అవకాశాలు కల్పించామని తెలిపారు. మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చినట్లు వెల్లడించారు. పార్టీలో పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. మెరిట్ ఆధారంగానే అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దాన్ని దుర్వినియోగం చేయకూడదని హితవు పలికారు. ప్రతిభ కనబరిస్తే ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి పదవులు కూడా సాధ్యమని అన్నారు. నాయకులు ప్రజల్లో ఉండాలని సూచిస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రాహుల్ గాంధీ పాదయాత్రలను ప్రస్తావించారు. దేశం కోసం త్యాగాలు చేసిన మోతీలాల్ నెహ్రూ, జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలను స్మరించారు.

### గ్రామీణ ప్రాంతాల్లో

# ఇళ్లు మంజూరు చేయాలి

- కనీసం ఈ ఏడాదిలో మూడు లక్షల ఇండ్లు ఇవ్వాలి
- పేదల సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం
- కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి మంత్రితో మంత్రి పొంగులేటి భేటీ



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

గ్రామీణ ప్రాంతాల్లో గడచిన పన్నెండు సంవత్సరాలుగా ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని పేర్కొంటూ, కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కేంద్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో పేదల గృహ నిర్మాణం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, పది సంవత్సరాల్లో కేంద్రం నుంచి ఒక్క ఇల్లు కూడా తీసుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం సహకరిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ రెండో దశలో అధికారికంగా చేరిందని, ఇంటింటికీ నిర్వహించిన సర్వే ద్వారా పదకొండు లక్షల యాభై ఏడు వేల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు వివరించారు. గత పన్నెండు ఏళ్ల పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి వెల్లడించారు. పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఢిల్లీకి ఉగ్ర ముప్పు!

మొదటి పేజీ తరువాయి

రచించినట్లు సమాచారం అందింది. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన పేలుడు ఘటనకు ప్రతీకారంగా భారత్‌లోని ధార్మిక స్థలాలను లక్ష్యంగా చేసుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. కేవలం ఢిల్లీ మాత్రమే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా హిట్ జాబితాలో ఉన్నాయనే సమాచారం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కీలక ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఎర్రకోట పరిసరాలు, చాందినీ చౌక్, వారసత్వ ప్రదేశాలు, రద్దీ మార్కెట్ల వద్ద భారీగా బలగాలను మోహరించారు. సీసీటీవీ పర్యవేక్షణను పెంచడంతో పాటు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. బాంబు నిర్వీర్య దళాలు, కుక్కల బృందాలను వ్యూహాత్మక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో గస్తీ కొనసాగిస్తున్నారు. గతంలో కూడా ఢిల్లీలో జరిగిన పేలుళ్లు దేశాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. హైకోర్టు ప్రాంగణం, మార్కెట్ ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో జరిగిన దాడులు ప్రాణనష్టం కలిగించాయి. ఆ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ప్రతి యత్నాన్ని కట్టడి చేయడానికి కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అరెస్టు

### ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్ట్

**వేద న్యూస్, హైదరాబాద్**

కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డిపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు బయలుదేరిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డిని పోలీసులు మేడ్చల్ చౌరస్తా వద్ద అడ్డుకుని అరెస్టు చేశారు. కామారెడ్డిలో జరిగిన ఘటనపై స్పందిస్తూ బాధిత ఎమ్మెల్యేను పరామర్శించేందుకు వెళ్తుండగా అక్రమంగా అడ్డుకున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. పెద్దఎత్తున పోలీసులు మోహరించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చర్యపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ప్రజాప్రతినిధులకే ప్రజాస్వామ్య హక్కులు లభించని పరిస్థితి నెలకొంటే సాధారణ ప్రజలకు ఏం న్యాయం దక్కుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కామారెడ్డి ఘటన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు ఉద్రిక్తంగా మారాయి. ఈ వ్యవహారంపై మరిన్ని రాజకీయ ప్రతిస్పందనలు వెలువడే అవకాశముంది. కాగా, ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి నివాసంపై జరిగిన దాడి నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు కామారెడ్డి బయలుదేరిన ఈటల రాజేందర్‌ను పోలీసులు అడ్డుకున్నారు.

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 22, 2026

# ఘనంగా సేవాలాల్ జయంతి

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**వేద న్యూస్, కారేపల్లి:**

మండల పరిధిలోని కారేపల్లి తహసీల్దార్ గ్రౌండ్ సమీపంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణలో బంజారా సమాజం ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజన సమాజానికి మార్గదర్శిగా నిలిచి మూఢనమ్మకాలను తొలగించి ధార్మిక విలువలను ప్రచారం చేశారని కొనియాడారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ఎమ్మార్వో అనంతుల రమేష్, కారేపల్లి సీఐ సునావత్ సాగర్, ఎస్సై బైరు గోపి, వివిధ గ్రామాల సర్పంచులు, గిరిజన సంఘాల నాయకులు, తండాల పెద్దలు, మహిళలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బంజారా మహిళలు సాంప్రదాయ నృత్యాలు, 'లోలా' పాటలతో వేడుకలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

# ఉద్యమకారుల హామీల అమలుకు కృషి

**– ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యమకారుల ఫోరం**



**వేద న్యూస్, శాయంపేట:**

తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కృషి చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు తెలిపారు. శాయంపేట మండల కేంద్రంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవ పెన్షన్ తదితర హామీలను నెరవేర్చే చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గిద్దమారి సురేష్, పల్లెబోయిన సారయ్య, బాసాని విద్యాసాగర్, గిద్దమరి రామన్న, యూత్ జిల్లా అధ్యక్షుడు కొమ్ముల శివ, మండల నాయకులు ముంజల నాగరాజు, ఎండి రఫీ, కానుగుల నాగరాజు, రంగు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**– బోయినిపల్లి మండల సీపీఎం కన్వీనర్ గురిజాల శ్రీధర్**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

గ్రామపంచాయతీల్లో గ్రామ సభల ప్రాధాన్యంపై ప్రజలకు సర్పంచులు, గ్రామ కార్యదర్శులు అవగాహన కల్పించాలని బోయినిపల్లి మండల సీపీఎం కన్వీనర్ గురిజాల శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో సమాచార హక్కు చట్టంపై యువతకు అవగాహన కలిగేలా బోర్డులు ఏర్పాటు చేయాలని, రెండు నెలలకు ఒకసారి నిర్వహించే గ్రామ సభల్లో స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ సభలకు ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యుత్ సిబ్బంది తదితర శాఖల అధికారులు కూడా హాజరైతే సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారుల ద్వారా సర్పంచులకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

# ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు అభినందన సభ



**వేద న్యూస్, మందమర్రి:**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు అభినందన సభను శనివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి పూర్తి చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లనున్న విద్యార్థులకు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదవ తరగతి అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. పదవ తరగతి అనంతరం విద్యార్థి భవిష్యత్తు దిశ నిర్ణయించబడుతుందని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని సూచించారు. జీవితంలో విజయాన్ని సాధించడానికి క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే స్వభావం అవసరమని తెలిపారు. పాఠశాలలో నేర్చుకున్న విలువలు, నైతికత, క్రమశిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అవుతాయని అన్నారు. పాఠశాల ఆనవాయితీ ప్రకారం 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. పాటలు, నృత్యాలు, వినోద కార్యక్రమాలతో సభ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినివిద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో మాతృభాష దినోత్సవం

**వేద న్యూస్, మెట్పల్లి:**

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా మెట్పల్లి మండలంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల మేడిపల్లి (పడమర)లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కవుల పరిచయాలతో కూడిన చార్టులు, తెలుగు పదాలు, వ్యాకరణ చార్టులు ప్రదర్శించి విద్యార్థులు ఆకట్టుకున్నారు. తెలుగు భాష గొప్పతనంపై ఉపన్యాస పోటీలు, పద్యపఠనం, పాటల పోటీలు, తెలుగు క్విజ్ నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి మేకల చంద్రశేఖర్ తెలుగు భాష ప్రాముఖ్యతను వివరించారు. అలాగే 10వ తరగతి విద్యార్థులకు గణితం, భౌతిక శాస్త్ర ప్రత్యేక అధ్యయన సామగ్రిని అందజేసి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ



కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ నాగమణి, ఉపాధ్యాయులు శ్రీదేవి, పద్మలత, నాగన్న, జ్యోతి, భీమన్న, సొప్పరి శ్రీనివాస్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి

**– స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సూచన**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి స్వచ్ఛమైన తాగునీరు అత్యంత అవసరమని, గ్రామీణ ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, పరిశుభ్రమైన నీటిని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు మాలోతు రమేష్, ఎర్రబెల్లి రఘుపతిరావు, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దూరి తిరుపతిరావు, గ్రామ సర్పంచ్ వాంకుడోత్ హేమలత శ్రీధర్, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**– ఎస్సై జక్కుల పరమేష్**

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎఫ్ఎల్ కౌన్సిలర్ మారపల్లి క్రాంతి కుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఎస్సై జక్కుల పరమేష్, సర్పంచ్ ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై జక్కుల పరమేష్ మాట్లాడుతూ.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వీడియోలు, నకిలీ లింకులు, ఆన్‌లైన్ లోన్ ఆఫర్లు, వాట్సాప్ సందేశాల ద్వారా సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలిపారు. అపరిచిత లింకులు ఓపెన్ చేయడం, ఓటీపీ వివరాలు పంచుకోవడం, అనధికారిక యాప్‌లను వినియోగించడం వల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని హెచ్చరించారు. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు వచ్చినట్లు చూపించి



తిరిగి పంపాలని అడిగే మోసాలపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సందేహాస్పద లింకులు ఓపెన్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, కుమారస్వామి, మారపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో ఇంచార్జి కలెక్టర్ తనిఖీ

**– అన్ని సబ్జెక్టులు చదివి, గత ప్రశ్నాపత్రాలు సాధన చేయాలి**

**– విద్యార్థులకు గరిమ అగ్రవాల్ సూచన**



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు పరిశీలించడంతో పాటు కిచెన్, స్టోర్‌రూమ్, భోజనానికి వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సిలబస్ పూర్తి స్థితిపై ఆరా తీశారు. సైన్స్‌కు సంబంధించిన ప్రశ్నలు అడిగి, నాడీకణ నిర్మాణాన్ని బోర్డుపై గీయాలని సూచించగా, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు అన్ని సబ్జెక్టులను సమగ్రంగా చదవడంతో పాటు గత ప్రశ్నాపత్రాలను సాధన చేయాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పదో తరగతి మార్కులు ఉన్నత విద్య, భవిష్యత్ కెరీర్‌కు కీలకమని పేర్కొన్నారు. అదనంగా, పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ఎల్లారెడ్డిపేటలో గొర్లు, మేకల అంగడి ప్రారంభం

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట గ్రామంలో గొర్లు, మేకల అంగడిని గ్రామపంచాయతీ సర్పంచ్ ఎలగందుల నరసింహులు, ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు శనివారం ఉదయం ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి అంగడిని ప్రారంభించగా, మొదటి రోజే దాదాపు రూ. 5 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి వ్యాపారులు, రైతులు గొర్లు, మేకలను అంగడికి తీసుకువచ్చి కొనుగోలు, అమ్మకాలు నిర్వహించారు. స్థానికంగా అంగడి ఏర్పాటు చేయడం వల్ల రైతులు, వ్యాపారులకు అనుకూల ధరలు లభిస్తాయని, ప్రయాణ ఖర్చులు తగ్గుతాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలగందుల నరసింహులు మాట్లాడుతూ..



అంగడిలో వ్యాపారులు, రైతులకు అవసరమైన నీటి సౌకర్యం సహా ఇతర సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మణరావు, ఎంపీటీసీలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 22, 2026

# గడ్డి లారీకి మంటలు

**- తప్పిన పెను ప్రమాదం**

**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట ప్రధాన రహదారిపై శనివారం గడ్డి లోడ్‌తో వెళ్తున్న లారికి మంటలు చెలరేగి పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం కొల్చారం గ్రామానికి చెందిన ఏపీ 09 టి 9192 నంబర్ లారీ ఎల్లుపేట గ్రామ శివారులో 350 గడ్డి మోపులు లోడ్ చేసి ప్రధాన రహదారిపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి కర్రల సహాయంతో గడ్డిని లారీ నుంచి బయటకు తోసివేసి మంటలు మరింత వ్యాపించకుండా అడ్డుకున్నారు. మంటల కారణంగా రోడ్డుపై గడ్డి మోపులు చెల్లాచెదురుగా పడిపోవడంతో కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటనలో



సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు లారీ డ్రైవర్ నాగరాజు తెలిపారు. నల్లకుంట తండాకు చెందిన సేవాలాల్ యూత్ సభ్యులు జేసీబీ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం పాపన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# మహిళల భద్రతపై షీ టీమ్ అవగాహన కార్యక్రమం

**- సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని సూచన**

**వేద న్యూస్, బోయినిపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో మహిళల భద్రతపై జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు షీ టీమ్ సిబ్బంది విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలను సందర్శిస్తూ చైతన్యం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, మహిళా రక్షణ చట్టాలు, షీ టీమ్ సేవలపై విద్యార్థులు, మహిళలకు వివరించారు. బోయినిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన షీ టీమ్ సిబ్బంది వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా సోషల్ మీడియాలో అపరిచితులతో మాట్లాడకూడదని, వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, సిబ్బంది వీరయ్య, శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులకు ఎమ్మెల్యే ఆత్మీయ సన్మానం

**వేద న్యూస్, కారేపల్లి:**

గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ సేవా భావం, ఆధ్యాత్మికతకు ప్రతీక అని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శనివారం సింగరేణి మండల పరిధిలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సర్పంచులు గ్రామాలకు వెన్నెముకలాంటివారని, ప్రభుత్వం అందించే నిధులను సద్వినియోగం చేస్తూ గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని కొనియాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడుస్తూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలకు అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజా ప్రతినిధులు,



వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- సులేమాన్ నగర్లో ఆరోగ్య సమితి సమావేశం**

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండలంలోని సులేమాన్ నగర్ గ్రామంలో ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్, గ్రామపంచాయతీ, అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఎంఎల్‌హెచ్‌పీ ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులు (బీపీ, షుగర్) నమోదు, పర్యవేక్షణకు సంబంధించిన ఆన్‌లైన్ విధానం గురించి వివరించారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది సీహెచ్ దీక్ష, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, ఫారజానా బేగం, గంగామణి, ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్ సాయిలీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



**వేద న్యూస్, పాపన్నపేట:**

పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు అంజాగౌడ్, నాగరాజు, నర్సింలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు 'మాతృభాషలోనే మాట్లాడుకుందాం' అనే అంశంపై పూర్తిగా తెలుగు భాషలోనే ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ మాట్లాడుతూ మాతృభాషపై పట్టు ఉంటే ఇతర భాషలను కూడా సులభంగా నేర్చుకుని అన్ని రంగాల్లో రాణించవచ్చని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వైద్య శాస్త్రవేత్త మన్నే ఉపేందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు ప్రవీణ్, కృష్ణకాంత్, యాదయ్య, నింగప్ప, వేణుగోపాల్ రెడ్డి, విశ్వనాథ్, ఇందిర, పద్మ, లక్ష్మి, రజిత, సుభాష్, శ్రీనివాస్, మహమూద్, నందిని తదితరులు పాల్గొన్నారు.

# చాత్తాద శ్రీ సంఘం జిల్లా ప్రెసిడెంట్ గా నరేష్

**వేద న్యూస్,జ్యోతినగర్:**

చాత్తాద శ్రీ సంఘం పెద్దపల్లి జిల్లా ప్రెసిడెంట్ గా కొండపలకల నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.ఎలక్షన్ ఆఫీసర్ దాస్యం కృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ..సంఘం అభివృద్ధి కోసం ఆహర్నిషలు శ్రమిస్తానని అన్నారు.ఎన్నికకు సహకరించిన గరిమెళ్ళ శ్రీనివాస్, గరిమెళ్ళ రమేష్,బండవరం సత్య నారాయణ, శ్రీ హరి, శ్రావణ్, అభి, కిషోర్, వెంకన్న,వేణు కు కృతజ్ఞతలు తెలిపారు.



# రేపటి నుంచి ప్రజావాణి పునఃప్రారంభం

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**వేద న్యూస్, మంచిర్యాల:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని 23వ తేదీ నుండి తిరిగి ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం యధాతథంగా నిర్వహించ బడుతుందని పేర్కొన్నారు. ప్రజలు, దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అందజేయాలని కలెక్టర్ సూచించారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**- దర్యాప్తు చేస్తున్న పోలీసులు**



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం ఎర్ధండి గ్రామ శివారులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన ఎర్రోళ్ల లింబాద్రి (51) బాశెట్టి గణేష్‌కు చెందిన పంట పొలం వద్ద తలకు తీవ్ర గాయాలతో రక్తస్రావం అయ్యి మృతిచెందినట్లు గుర్తించారు. సంఘటన స్థలానికి కొద్ది దూరంలో మృతుడి బైక్ రోడ్డుపక్కన పడివుండటం గమనార్హం. పోలీసుల వివరాల ప్రకారం, మృతుడు లింబాద్రి కుటుంబ కలహాల కారణంగా గత కొంతకాలంగా భార్య, పిల్లల నుండి వేరుగా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో ఎర్ధండి గ్రామానికి వచ్చి భార్య లక్ష్మి, పిల్లలతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ ఎర్ధండి గ్రామపంచాయతీ కార్యదర్శి పూదరి మనోజ్ ఫిర్యాదు చేయడంతో ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సంఘటన స్థలాన్ని మెట్పల్లి సీఐ అనిల్ కుమార్, ఎస్సై నవీన్ పరిశీలించారు. కుటుంబ కలహాల కోణంలో పోలీసులు అన్ని విధాలుగా విచారణ చేపడుతున్నారు.

# పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

**- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**- పాలిటెక్నిక్ నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన**

**వేద న్యూస్, హనుమకొండ:**

వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా, మరో ఏడు దశాబ్దాలు నిలిచేలా నిర్మాణం చేపట్టాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రూ.28 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన పనులను ఆయన పరిశీలించారు. మహిళా వసతి గృహ నిర్మాణం గడువుకంటే ముందుగానే పూర్తవడంపై హర్షం వ్యక్తం చేసి, సంబంధిత అధికారులు, గుత్తేదారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రధాన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.




అనంతరం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ విద్యా అవగాహన కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులు, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్, మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రామప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇళ్ల పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండలం కొండాపురం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పత్రాలను గ్రామ సర్పంచ్, గ్రామ కమిటీ అధ్యక్షునికి అందజేశారు. ఈ పత్రాల పంపిణీతో గ్రామ ప్రజల గృహ కలల సాకారం దిశగా కీలక అడుగు పడిందని ఎమ్మెల్యే తెలిపారు. పత్రాలు అందడంతో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అవుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, సురేష్, కొండా వెంకటనారాయణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో ఈ సందర్భంగా సంతోష వాతావరణం నెలకొంది.

వేద న్యూస్



# రసాయన ఎరువులు తక్కువ మోతాదులో వాడాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

**వేద న్యూస్, నల్లబెల్లి:**

రైతులు రసాయన ఎరువులను తక్కువ మోతాదులో వాడుతూ, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. నల్లబెల్లి మండలం కొండాయిలపల్లి గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మిర్చి పంట కోత అనంతరం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. సేంద్రీయ విధానాలతో సాగు చేసిన పంటలకు మార్కెట్‌లో మంచి ధర లభించడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు నాణ్యమైన మిర్చి ఉత్పత్తి చేసి మార్కెట్‌కు తీసుకువస్తే మంచి ధరలు లభిస్తాయని, వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ధరలను ఎలక్ట్రానిక్ బోర్డులపై ప్రదర్శిస్తున్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ మిర్చి ఎగుమతులకు అవసరమైన నాణ్యత ప్రమాణాలు, ఆరబెట్టే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడికి అనుసరించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మిర్చి బస్తాలను 49 కిలోలలోపు నింపాలని,



తేమ శాతం 1012 శాతం మధ్య ఉండేలా చూసుకోవాలని సూచించారు. అధిక తేమతో మిర్చి రంగు మారి నాణ్యత తగ్గి ధర తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే తాలు మిర్చి, పండు కాయలను వేరు చేసి మార్కెట్‌కు తీసుకురావడం ద్వారా పోటీ ధరలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఎరూకల స్వప్న, జిల్లా వ్యవసాయ అధికారులు అనురాధ, దామోదర్ రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, మార్కెట్ ఆఫీసర్ సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి రవీందర్ రెడ్డి, మండల పరిషత్ అధికారులు, ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ప్రశ్నోత్తరాల ద్వారా నిర్వహించిన ఈ సమావేశం సజీవంగా సాగి, రైతులు తమ సందేహాలను వ్యక్తం చేయగా అధికారులు, శాస్త్రవేత్తలు సమగ్రంగా వివరణ ఇచ్చారు.

# రైతులకు 50 శాతం సబ్సిడీతో ఎరువులు

- ట్రైకోడెర్మా, సుడోమోనస్, భాస్వరం ఎరువులపై రాయితీ
- మండల వ్యవసాయ అధికారి రజిత

**వేద న్యూస్, నల్లబెల్లి:**



రైతులకు పంటల అభివృద్ధికి ఉపయోగపడే ట్రైకోడెర్మా, సుడోమోనస్, భాస్వరం కరిగించే ఎరువులు (పీఎస్‌బీ)పై 50 శాతం సబ్సిడీ అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి బన్న రజిత తెలిపారు. ట్రైకోడెర్మా ఒక కిలో ధర రూ.100 కాగా, అందులో రూ.50 సబ్సిడీగా లభించి రైతులు కేవలం రూ.50 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే సుడోమోనస్ ఒక కిలో ధర రూ.150 కాగా, అందులో రూ.75 సబ్సిడీగా లభించి రైతులు రూ.75 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ ఎరువులు నేలలో ప్రయోజనకర జీవాణువుల పెరుగుదలకు సహకరించి పంటల ఆరోగ్యం మెరుగుపడటానికి, దిగుబడులు పెరగడానికి ఉపయోగ పడతాయని వ్యవసాయ శాఖ పేర్కొంది. రైతులు తమ రెవెన్యూ లేదా అటవీ హక్కుల పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకం వివరాలతో నల్లబెల్లి రైతు వేదికలో దరఖాస్తు చేసుకుని ఈ సబ్సిడీని పొందవచ్చని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

# ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన లక్కం రాజశేఖర్ (45) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మూడు రోజుల క్రితం అతని భార్య తన తల్లిగారి ఇంటికి వెళ్లగా, శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు లుంగీతో ఉరి వేసుకుని మృతి చెందాడు. శుక్రవారం ఉదయం రాజశేఖర్ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన అతని అన్న లక్కం శ్రీనివాస్ ఇంటికి వెళ్లి చూడగా, అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి సోదరుడు లక్కం శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై జి. నవీన్ తెలిపారు.

# నేడు ఉచిత మెగా ఫిజియోథెరపీ శిబిరం

- రోబోటిక్ టెక్నాలజీతో చికిత్స
- గ్రౌండ్‌ను పరిశీలించిన సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ వైరా ఇంచార్జ్ భూక్యా శివ నాయక్



**వేద న్యూస్, కారేపల్లి:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నేడు నిర్వహించనున్న ఉచిత ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ వైరా ఇంచార్జ్ భూక్యా శివ నాయక్ కోరారు. శనివారం ఆయన లంబాడాల ఐక్యవేదిక నాయకులతో కలిసి శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భూక్యా శివ నాయక్ మాట్లాడుతూ.. కారేపల్లి మండలం కొత్త తండాకు చెందిన న్యూరో రిహాబిలిటేషన్ నిపుణులు, మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాధావత్ రవి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాల అనుభవం కలిగిన డాక్టర్ రవి హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో ఫిజియోథెరపీ కేంద్రాలను నిర్వహిస్తూ అనేక మందికి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో మొట్టమొదటిసారిగా అధునాతన రోబోటిక్ టెక్నాలజీ ద్వారా చికిత్స అందించనున్నట్లు తెలిపారు. పక్షవాతం, కీళ్ల నొప్పులు, వెన్నుపూస సమస్యలు, నరాల బలహీనత వంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నగరాలకు వెళ్లలేని నిరుపేదలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడాల ఐక్యవేదిక ప్రతినిధి బానోత్ బాలు నాయక్, గిరిజన నాయకులు అజ్మీరా వీరన్న నాయక్, వాంకుడోత్ విజయ్, వ్యాపారవేత్త పిల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బూడియా బాపు 26వ వార్షికోత్సవం

- ఇస్లావత్ కిషన్ సాదు ఆధ్వర్యంలో మహా భోగ్ భండారో

**వేదన్యూస్, కారేపల్లి:**



సింగరేణి మండల పరిధిలోని అలియాతండా గ్రామంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బూడియా బాపు 26వ వార్షికోత్సవ మహా భోగ్ భండారో మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇస్లావత్ కిషన్ సాదు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు వివిధ తండాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూడియా బాపు విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి, బంజారా సంప్రదాయ పద్ధతుల్లో ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. హోమగుండం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి లోక కల్యాణం కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా భోగ్ భండారో కార్యక్రమంలో బాపు బోధనలు, ఆయన చూపిన ధర్మ మార్గం గురించి భక్తులకు వివరించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేలాది మంది భక్తులకు మహా అన్నదాన వితరణ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఈ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఇస్లావత్ కిషన్ సాదు మరియు వారి బృందాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గిరిజన పెద్దలు, ప్రజా ప్రతినిధులు, యువకులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ తెలంగాణ చారిత్రక వైభవానికి ప్రతీక

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం
- 9వ వార్షిక తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ప్రారంభం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో శనివారం 9వ వార్షిక తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ఘనంగా ప్రారంభమైంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్యులు, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షులు ఆచార్య ఈ. సుధారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్ర అనేది కేవలం గతాన్ని నమోదు చేయడమే కాకుండా, వాస్తవ ఆధారాలపై నిలిచే పరిశోధన ద్వారా భవిష్యత్తుకు దృఢమైన పునాది వేయగలదని పేర్కొన్నారు. వరంగల్ నగరం తెలంగాణ చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని, కాకతీయుల కళాసంపద నుండి ఆధునిక సామాజిక ఉద్యమాల వరకు ఈ నేల చరిత్రకు సాక్ష్యమని తెలిపారు. తెలంగాణ చరిత్రను వెలుగులోకి తేవడంలో చరిత్రకారులు, పరిశోధకులు చేసిన కృషిని ఆయన అభినందించారు. సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ విభాగాల డీన్ ఆచార్య బి. సురేష్ లాల్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల ద్వారా ఉపాధి అవకాశాలు



పెరుగుతున్నాయని, గిరిజన సమాజాల చరిత్రను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య జి. వెంకటరాజం సంస్థ చరిత్ర పరిశోధనకు శాస్త్రీయ వేదికగా నిలుస్తోందని తెలిపారు. ప్రధాన కార్యదర్శి అంకం జయప్రకాశ్ మాట్లాడుతూ యువ పరిశోధకులు చరిత్ర అధ్యయనంపై మరింత శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా “తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 8వ వార్షిక సమావేశాల నివేదిక”ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు. మొదటి రోజు సదస్సులో మూడు స్మారక ఉపన్యాసాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# రజకులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

**వేద న్యూస్, దామరచర్ల:**




నాగర్‌కర్నూలు జిల్లాలో మల్లన్న దర్శనం కోసం వెళ్లిన రజక కుటుంబంపై దాడి చేసి, రెండు నెలల పసిపాప మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మల్లన్న దేవుని దర్శనానికి వెళ్తున్న చాకలి చంద్రకళ కుటుంబాన్ని కొంత మంది అడ్డుకొని దారుణంగా దాడి చేశారని తెలిపారు. చంద్రకళ, ఆమె కుమారుడు గణేష్, కోడలు, కుమార్తెపై దాడి చేయడంతో పాటు, వారి వద్ద రెండు నెలల పసిపాప ఉన్నప్పటికీ కనికరం చూపకుండా దాడి చేయడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడి కారణంగా పసిపాప తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనలో పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, భద్రత కల్పించాలని బీసీ జేఏసీ విజ్ఞప్తి చేసింది.

# ‘లైంగిక’ బాధితులకు ‘భరోసా’

- జిల్లా అదనపు ఎస్పీ మహేందర్
- సెంటర్‌ను తనిఖీ.. రికార్డుల పరిశీలన

**వేద న్యూస్, మెదక్:**

లైంగిక వేధింపులకు గురైన మహిళలు, బాలలకు భరోసా సెంటర్ ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఆయన సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణను పరిశీలించిన అదనపు ఎస్పీ, పోక్సో కేసులు, బాధితుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, మానసిక కౌన్సిలింగ్, న్యాయ సహాయం, అవగాహన కార్యక్రమాల నిర్వహణ తీరును సమీక్షించారు. లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు, బాలల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వారికి భయాందోళనలు లేకుండా ధైర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు సమయానుకూలంగా న్యాయ, వైద్య సహాయం అందించడంతో పాటు మాన సిక బలం



చేకూర్చాలని ఆదేశించారు. భరోసా సెంటర్ లక్ష్యం బాధితులకు ఒకే చోట న్యాయ, వైద్య, మానసిక సహాయం అందించడమేనని అదనపు ఎస్పీ తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన వారు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భరోసా ఎస్ఐ శిరీష, కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లు సుపరిపాలన అందించాలి



- గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి
- పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్‌లు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఖమ్మంలోని డీపీఆర్సీ సెంటర్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన సర్పంచ్‌లకు శుభాకాంక్షలు తెలియజేసిన కలెక్టర్, వచ్చే ఐదేళ్లలో గ్రామాభివృద్ధికి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు ఐదు రోజులపాటు సర్పంచ్‌లకు విధులు, బాధ్యతలు, కార్యాచరణపై ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, పచ్చదనం పెంపుపై సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. పంచాయతీ పాలకవర్గ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి, నిర్ణయాలను రికార్డు చేయాలని సూచించారు. గ్రామ సమస్యల పరిష్కారంలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని తెలిపారు. గ్రామాల్లో పన్నుల వసూళ్లపై శ్రద్ధ పెట్టి, బకాయిలు వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ఎన్నికల తరువాత రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులుగా రూ.33 కోట్లు జమయ్యాయని, అందులో రూ.20 కోట్లు పారిశుద్ధ్యం, సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులకు, రూ.13 కోట్లు అభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉందని తెలిపారు. ఈ నిధులను సక్రమంగా వినియోగించేందుకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించడం మాత్రమే కాకుండా పారిశుద్ధ్యం, పచ్చదనం, ప్రభుత్వ పథకాల అమలుపై కూడా దృష్టి పెట్టాలని అన్నారు. సమర్థవంతమైన పాలనతో గ్రామాలను జాతీయ స్థాయి అవార్డులు సాధించేలా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

# ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా మణికంఠ

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోగినేపల్లి గ్రామానికి చెందిన ఉప్పునూతల మణికంఠ నాయుడు, డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అభిమానుల సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మణికంఠ నాయుడు మాట్లాడుతూ.. ఈ బాధ్యత తనకు లభించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి ప్రతిభ, సేవలను చూసి తాను ఆయన అభిమానిగా మారానని పేర్కొన్నారు. అభిమానుల సంఘం జిల్లా ఉపాధ్యక్ష పదవికి ఎంపిక చేసిన సంఘ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తూ, డా. దివ్యమూర్తి ఆశయాలను ప్రజల్లో విస్తరించేందుకు తన వంతు కృషి చేస్తానని మణికంఠ నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మాతృభాష మన అస్తిత్వం

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ శుభాకాంక్షలు

**వేద న్యూస్, కారేపల్లి:**



కన్నతల్లి ఎంత పవిత్రమైనదో, మన మాతృభాష కూడా అంతటి గౌరవప్రదమైనదని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు, భాషాభిమానులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక కాలంలో ఎన్ని భాషలు నేర్చుకున్నా, మన మూలాలను మర్చిపోకూడదని హితవు పలికారు. తెలుగు భాషా తీయదనంతో పాటు గిరిజన ప్రాంతాల్లోని మాండలికాలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ప్రభుత్వ పాలన, విద్యాబోధన మాతృభాషలో సాగితేనే సామాన్యులకు సులభంగా అర్థమవుతుందని, సమాజ అభివృద్ధి వేగవంతమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు, ఇతర మాతృభాషలు మాట్లాడే వారు తమ భాషపై గర్వంగా ఉండాలని కోరారు. మాతృభాష భావాలను వ్యక్తం చేసే శక్తివంతమైన సాధనమని, పరభాషలను గౌరవిస్తూ మాతృభాషను ప్రేమించి పరిరక్షించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆయన పిలుపుతో నియోజకవర్గంలోని పలు విద్యాసంస్థలు, సాంస్కృతిక సంఘాలు మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయి.

# దివ్యాంగ చిన్నారుల విజయాలు స్ఫూర్తిదాయకం

- ఎంఈఓ రాథోడ్ రమేష్

**వేద న్యూస్, మందమర్రి:**




దివ్యాంగ చిన్నారుల విజయాలు సమాజంలోని ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని మందమర్రి మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ రమేష్ అన్నారు. శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగిన దివ్యాంగ విద్యార్థుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో మందమర్రికి చెందిన విద్యార్థి వరుణ్ దేశ్ (10) రన్నింగ్, క్యారమ్ పోటీలలో ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించాడని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. శారీరక పరిమితులను అధిగమించి ధైర్యంగా పోటీలలో పాల్గొని విజయాలు సాధించడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలలో రాణించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, భీంపుత్ర శ్రీనివాస్, లలిత, రవి, మంజుల, రజిత, సరిత, శంకర్, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సీఎం కప్ విజేత నిఖితకు అభినందనలు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో ఆమనగల్లు గ్రామానికి చెందిన నికిత 400 మీటర్ల మహిళల పరుగు పందెంలో రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం సాధించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పిల్లల సందీప్, వార్డు సభ్యులు, పీఈటీ అనంతుల పుల్లయ్య, గ్రామ ప్రజలు నికితకు స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# నివాస స్థలం కల్పించాలి

- గుడిసెలు తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నాం
- కలెక్టర్‌ను ఆశ్రయించిన బుడిగ జంగాలు

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బుడిగ జంగాలు తమకు నివాస స్థలం కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము గత 20 సంవత్సరాలుగా అదే ప్రాంతంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇటీవల గుడిసెలను తొలగించడంతో నివాసం లేక ఇబ్బందులు పడుతున్నామని, తాము ఎక్కడికి వెళ్లాలో తెలియక ఆందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యను విన్న కలెక్టర్ గరిమ అగర్వాల్ స్పందిస్తూ, బుడిగ జంగాల సమస్యపై సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులను వెంటనే సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నివేదిక ఆధారంగా నివాస స్థలం కల్పించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

# స్టార్ ఎస్ఎస్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**వేద న్యూస్, కారేపల్లి:**



కారేపల్లి మండల కేంద్రంలో స్టార్ ఎస్ఎస్ వాటర్ ప్లాంట్ ను శనివారం స్థానిక సర్పంచ్ మేదరి టోనీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఉడతల సంపత్-సరిత దంపతులు ఈ వాటర్ ప్లాంట్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి టోనీ మాట్లాడుతూ.. కలుషిత నీటి వల్ల అనేక వ్యాధులు వ్యాపిస్తున్న నేపథ్యంలో నాణ్యమైన తాగునీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ ప్లాంట్ ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని, నిర్వాహకులు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్లాంట్‌లో అధునాతన ఫిల్ట్రేషన్ పద్ధతులతో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాలకు డోర్ డెలివరీ సౌకర్యం కల్పిస్తామని ప్లాంట్ యజమాని ఉడతల సంపత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, మాజీ వార్డు సభ్యుడు గంగరబోయిన సత్యం, స్థానిక ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హనుమాన్ దేవాలయ ఘనంగా రెండో వార్షికోత్సవం

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో హనుమాన్ దేవాలయ రెండో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఆంజనేయస్వామి పల్లకిని నిర్మించి, ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం పల్లకి సేవతో స్వామివారి శోభాయాత్రను భజనలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన మండలి సభ్యులను ఆహ్వానించి సుమారు 100 మందిని ఘనంగా సన్మానించనున్నారు. జిల్లా స్థాయిలో అవార్డులు అందుకున్న సిరిసిల్ల, బండలింగంపల్లి, దుమాల, రాచర్ల గొల్లపల్లి, గూడెం, అల్మాస్పూర్, బొల్లారం లింగంపల్లి గ్రామాల భజన బృందాలకు ప్రత్యేక సన్మానం చేయనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు. దేవాలయ చైర్మన్ లద్దునూరి హనుమాన్లు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

- హుండీ ఆదాయం రూ.27.44 లక్షలు

**వేద న్యూస్ హనుమకొండ :**



చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయి స్తంభాల దేవాలయంలో ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన తొమ్మిది హుండీల లెక్కింపును శనివారం ఆలయ నాట్య మండపంలో నిర్వహించారు. దేవాదాయ శాఖ పరిశీలకుడు ప్రసాద్, కార్యనిర్వాహణాధికారి డి. అనిల్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా మొత్తం రూ.27,44,268 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గత సంవత్సరం వచ్చిన రూ.25,37,000తో పోలిస్తే ఈసారి రూ.2,07,268 అధికంగా వచ్చిందని కార్యనిర్వాహణాధికారి వెల్లడించారు.

# మెరుగు వెంకమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం

- అందజేసిన సహకార సంఘం మాజీ చైర్మన్ గడ్డం స్పృధర్ రెడ్డి

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన మెరుగు వెంకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సల్కునూరు సహకార సంఘం మాజీ చైర్మన్ గడ్డం స్పృధర్ రెడ్డి మృతురాలి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం కుటుంబ సభ్యులను చరవాణి ద్వారా పరామర్శించి, భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పల్ల బిక్షం, కోల మల్లయ్య, వాకిటి బిక్షం, కోల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్‌లకు





## విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం సన్మానం

**వేద న్యూస్, కరీంనగర్:**

విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కరీంనగర్ మేయర్ కోలకాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి, ప్రకాష్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాల చారి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొని ప్రజాప్రతినిధులను అభినందించారు. నగర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదారం శ్రీనివాస్, గౌరవ సలహాదారు వేమునూరి కనుక చారి, ఉపాధ్యక్షులు శానగొండ నరేష్, ప్రచార కార్యదర్శి కరుణకంటి లక్ష్మీనారాయణ చారి, వివిధ మండలాల ప్రతినిధులు, విశ్వకర్మ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి

**– పీడిత వర్గాల సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ : రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

పీడిత వర్గాల సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని వరంగల్ పరిధి 19 వ డివిజన్ కాశీబుగ్గ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మంత్రి పాల్గొని బంజారాలతో కలిసి నృత్యాలు చేసి సంత్ సేవాలాల్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి డోలు వాయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డిటిడిఓ నారాయణ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ మహిళలు, పీడిత వర్గాల సమానత్వం కోసం సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకం ఆచరణీయమని, బంజారా బిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి, వారి అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. సత్యం, అహింస, మానవత్వం, సమానత్వానికి ఉన్నతమైన నైతిక విలువల సందేశాన్ని వ్యాప్తి చేయడం ద్వారా సమాజంలో నూతన చైతన్యాన్ని నింపారని, ఆయన స్ఫూర్తిదాయకమైన జీవితం దేశ ప్రజలకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తుందని సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడు చూపిన శాంతి మార్గాన్ని, ఆయన బోధించిన జీవన విలువలను మనసారా స్మరించుకుందామని మాంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బంజారా ప్రతినిధులు మంత్రి, మేయర్ అధికారులు కార్పొరేటర్ లు మీడియా ప్రతినిధులను బంజారాల సంప్రదాయ తలపాగాలను ధరింపజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు పోశాల పద్మ, ఓని స్వర్ణలత భాస్కర్, వస్కుల బాబు, బాల్నే సురేష్, చింతాకుల అనిల్ కుమార్, ఆర్ డి ఓ సుమ, ఏసిపి శుభం, ట్రైనీ ఐపిఎస్ మనీషా,తహసీల్దార్ శ్రీకాంత్ బంజారా ప్రతినిధులు మోతీ నాయక్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



# కోర్టులో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

**వేద న్యూస్,రంగారెడ్డి :**



రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో బంజారాల ఆరాధ్య దైవం, అహింసా మూర్తి సద్గురు సంత్ శ్రీ శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బంజారా లాయర్ అసోసియేషన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్టిఐ సర్వీస్ సొసైటీ నేషనల్ ప్రెసిడెంట్ కె. బాబురామ్ నాయక్ అతిథిగా విచ్చేసి సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పాల్గొని తమ ప్రసంగాలతో సభికులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో ఆర్టిఐ మాజీ కమిషనర్ శంకర్ నాయక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ( పి పి ) వాణి మేడం, ఆర్టిఐ సర్వీస్ సొసైటీ గౌరవ సలహాదారు డా. రతన్ సింగ్, ప్రముఖులు డా. శ్రీనివాస్ నాయక్, ఆర్టిఐ సర్వీస్ సొసైటీ. కన్వీనర్ మరియు అడ్వకేట్ రమేష్ చౌహాన్, ప్రముఖులు బావోజీ పంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు. బంజారా లాయర్ అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, బంజారా సంస్కృతిని ప్రతిబింబించేలా వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ ( ఆర్టిఐ ) ద్వారా సామాన్య ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించడంలో న్యాయవాదుల పాత్రను అతిథులు కొనియాడారు. ఈ కార్యక్రమం ద్వారా బంజారా సమాజంలోని న్యాయ కోవిదులు, సామాజిక కార్యకర్తలు ఒకే వేదికపైకి వచ్చి సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు మరియు కోర్టు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐదు రోజుల్లో పెండ్లి..

# ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

**వేద న్యూస్ తుంగతుర్తి :**



తుంగతుర్తి మండల పరిధిలోని మంచ్యా తండాలో ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన ఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. తండాకి చెందిన లాకావత్ అమ్ము కుమారుడు లాకావత్ సోమన్న వివాహం ఈ నెల 26న జరుగనుంది. గుడిసె దగ్ధం కావడంతో పెండ్లికి సంబంధించిన బంగారు ఆభరణాలు, వస్త్రాలు, వస్తువులతో పాటు రూ.2 లక్షల నగదు దగ్ధమైంది. ఈ ఘటన షార్ట్ సర్క్యూట్ లేదా ఏ విధంగా జరిగిందో తెలియక బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమని ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

# మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగానికి నూతన సీఈఓగా ఆశా శర్మ




**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ తన గేమింగ్ విభాగానికి భారత సంతతి చెందిన ఆశా శర్మను నూతన ముఖ్య కార్యనిర్వాహణ అధికారిగా నియమించినట్లు అధికారికంగా ప్రకటించింది. ఇప్పటివరకు ఆ బాధ్యతలు నిర్వహించిన పదవీ విరమణ చేయడంతో సంస్థ ఈ కీలక బాధ్యతలను ఆశా శర్మకు అప్పగించింది. గేమింగ్ విభాగానికి ముఖ్య కార్యనిర్వాహణ అధికారిగా మాత్రమే కాకుండా ఉపాధ్యక్షురాలిగానూ ఆమె విధులు నిర్వహించనున్నారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ రంగంలో పోటీ తీవ్రంగా పెరుగుతోంది. వినియోగదారుల అభిరుచులు వేగంగా మారుతున్నాయి. క్లౌడ్ ఆధారిత గేమింగ్ సేవలు, సభ్యత్వ విధానాలు, ప్రత్యేక కంటెంట్ ఉత్పత్తి వంటి అంశాల్లో సంస్థలు పరస్పరం పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ గేమింగ్ విభాగం ఆదాయ వృద్ధి ఇటీవల కొంత మందగించినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. కాబట్టి కొత్త నాయకత్వం వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఆశా శర్మ విద్యాభ్యాసం పరంగా వ్యాపార నిర్వహణలో పట్టా పొందారు. కెరీర్ ప్రారంభ దశలోనే మైక్రోసాఫ్ట్ మార్కెటింగ్ విభాగంలో సేవలందించారు. 2013లో సంస్థను వీడి పలు అంతర్జాతీయ సాంకేతిక సంస్థల్లో ఉన్నత స్థాయి పదవుల్లో పనిచేశారు. ఆ సమయంలో ఉత్పత్తి అభివృద్ధి, వినియోగదారుల విస్తరణ, అంతర్జాతీయ మార్కెట్ వ్యూహాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. రెండు సంవత్సరాల క్రితం తిరిగి మైక్రోసాఫ్ట్‌లో చేరి కృత్రిమ మేధ విభాగంలో సీనియర్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. కృత్రిమ మేధ ఆధారిత సేవల విస్తరణ, స్మార్ట్ పరిష్కారాల అభివృద్ధి వంటి అంశాల్లో ఆమె నాయకత్వం సంస్థకు దోహదపడింది.

ఇప్పుడు గేమింగ్ విభాగానికి నాయకత్వం వహించాల్సిన సందర్భంలో, సాంకేతిక పరిజ్ఞానం మరియు వ్యాపార వ్యూహాల సమన్వయం కీలకమవుతోంది. గేమింగ్ కంటెంట్ ఉత్పత్తి, వినియోగదారుల అనుభవం మెరుగుదల, ప్రపంచ మార్కెట్లలో విస్తరణ, భాగస్వామ్యాల బలోపేతం వంటి అంశాల్లో ఆశా శర్మ ముందుండాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా యువతను ఆకర్షించే కొత్త తరహా గేమింగ్ వేదికలు, బహుళ పరికరాల్లో ఆడే అవకాశాలు, సభ్యత్వ ఆధారిత సేవల విస్తరణ వంటి రంగాల్లో సంస్థ మరింత దూకుడు ప్రదర్శించాల్సిన అవసరం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# నయా పంచ్ ఈవీ


**వేద న్యూస్ డెస్క్:**



దేశీయ ఆటోమొబైల్ రంగంలో ప్రముఖ సంస్థ విద్యుత్ వాహనాల విభాగాన్ని విస్తరించే దిశగా నయా పంచ్ విద్యుత్ కారును మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. ప్రారంభ స్థాయి విద్యుత్ వాహనాల విభాగంలో అడుగుపెడుతూ ఈ కొత్త మోడల్‌ను ఆవిష్కరించింది. ముంబై ప్రదర్శనశాల ధర ప్రకారం ఈ కారు ప్రారంభ ధర ₹9.69 లక్షలుగా నిర్ణయించారు. అదనంగా బ్యాటరీ అద్దె విధానంలో కూడా కొనుగోలు చేసే సౌకర్యాన్ని కల్పించారు. ఈ విధానంలో వాహన ధర ₹6.49 లక్షలుగా ఉండగా, బ్యాటరీ వినియోగానికి కిలోమీటరుకు ₹2.6 చెల్లించాల్సి ఉంటుందని సంస్థ ప్రయాణిక వాహన విభాగం అధిపతి శైలేష్ చంద్ర తెలిపారు. ఈ మోడల్‌కు ముందస్తు బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభమైనట్లు వెల్లడించారు. ఈ నయా పంచ్ విద్యుత్ కారులో 40 కిలోవాట్ల సామర్థ్యం గల బ్యాటరీ అమర్చారు. ఒకసారి పూర్తి చార్జ్ చేస్తే సుమారు 355 కిలోమీటర్ల ప్రయాణ సామర్థ్యం కలిగి ఉంటుంది. వేగవంతమైన చార్జింగ్ సౌకర్యంతో కేవలం 26 నిమిషాల్లోనే 20 శాతం నుంచి 80 శాతం వరకు విద్యుత్ నిల్వను పెంచుకోవచ్చు. భద్రత పరంగా ఆరు గాలిబ్యాగులు, 360 డిగ్రీల కెమెరా వ్యవస్థ, ఎత్తైన ప్రాంతాల్లో ఎక్కేటప్పుడు మరియు దిగేటప్పుడు నియంత్రణ సౌకర్యాలు, ఎలక్ట్రానిక్ స్థిరత్వ నియంత్రణ వ్యవస్థ వంటి ఆధునిక సదుపాయాలు కల్పించారు. అంతేకాకుండా 26 సెం.మీ పరిమాణంలో ఉన్న స్పర్శ ఆధారిత సమాచార వినోద తెర, తీగల అవసరం లేని దూరవాణి విద్యుత్ నింపే సౌకర్యం వంటి ఆధునిక లక్షణాలతో ఈ వాహనం వినియోగదారులను ఆకర్షించనుంది.

# ఏప్రిల్ 1 నుంచి టోల్ కేంద్రాల్లో నగదు చెల్లింపులకు ముగింపు

**వేద న్యూస్ డెస్క్:**



కేంద్రంలోని కూటమి ప్రభుత్వం దేశవ్యాప్తంగా టోల్ కేంద్రాల్లో నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ విధానం తప్పనిసరిగా అమల్లోకి రానుందని కేంద్ర రహదారి రవాణా శాఖ స్పష్టం చేసింది. టోల్ కేంద్రాల వద్ద పెరుగుతున్న రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడం, రుసుముల వసూళ్లలో పారదర్శకతను పెంచడం ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు అమల్లో ఉన్న వేగ చెల్లింపు పతకం ఉన్నప్పటికీ కొంతమంది వాహనదారులు నగదు చెల్లింపులతోనే ప్రయాణం కొనసాగిస్తున్న పరిస్థితి ఉంది. తాజా ఆదేశాలతో ఇకపై నగదు లావాదేవీలకు పూర్తిగా ముగింపు పడనుంది. ఇకముందు టోల్ కేంద్రాల్లో రుసుములు పూర్తిగా వేగ చెల్లింపు పతకం లేదా యూనిఫైడ్ చెల్లింపు విధానం వంటి డిజిటల్ మార్గాల ద్వారానే స్వీకరించబడతాయి.

# త్వరలో అమల్లోకి పాన్ కార్డు కొత్త నిబంధనలు..



**వేద న్యూస్ డెస్క్:**

ఆదాయపు పన్ను చట్టానికి సంబంధించిన పాన్ కార్డు విధానాల్లో మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు అయిన తాజాగా ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ప్రజల అభిప్రాయాల స్వీకరణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఈ మార్పులు త్వరలో అమల్లోకి వచ్చే అవకాశముంది. తాజా ప్రతిపాదనల ప్రకారం బ్యాంకు ఖాతాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో నగదు జమలు లేదా ఉపసంహరణలు 10,00,000 దాటితే తప్పనిసరిగా పాన్ కార్డు వివరాలు సమర్పించాలి. ప్రస్తుతం ఒకే రోజులో ₹50,000 కంటే ఎక్కువ నగదు జమచేస్తే పాన్ వివరాలు ఇవ్వాల్సిన నిబంధన అమల్లో ఉంది. ఇకపై అధిక మొత్తాల లావాదేవీలపై మరింత కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండనుంది.

5,00,000 కంటే ఎక్కువ విలువ కలిగిన వాహనాల కొనుగోలు సమయంలో పాన్ వివరాలు ఇవ్వడం తప్పనిసరి అవుతుంది. అలాగే భోజనశాలల్లో ఒకే బిల్లు 1,00,000 దాటిన సందర్భాల్లో వినియోగదారుల పాన్ వివరాలను నమోదు చేయాలని ప్రతిపాదించారు. గతంలో ఈ పరిమితి ₹50,000గా ఉండేది. వినోద కార్యక్రమాలు, ప్రదర్శనలు, క్రీడా వేడుకల నిర్వహణ సేవలు అందించే సంస్థలు కూడా వినియోగదారుల పాన్ వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. 20,00,000 కంటే ఎక్కువ విలువైన స్థిరాస్థి విక్రయాల సమయంలో కూడా పాన్ వివరాల వెల్లడింపు తప్పనిసరి చేయాలని ముసాయిదాలో పేర్కొన్నారు. అయితే మహానగరాలు మినహా ఇతర ప్రాంతాల్లో కొంత సడలింపు కల్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

బీమా రంగానికి సంబంధించిన మార్పుల ప్రకారం సంవత్సరానికి 5,00,000 కంటే ఎక్కువ ప్రీమియం చెల్లింపులపై పాన్ వివరాలు అవసరమయ్యేవి. కానీ తాజా ప్రతిపాదనల ప్రకారం అన్ని బీమా లావాదేవీల్లో పాన్ వివరాలు తప్పనిసరి చేయాలని సూచించారు. ప్రజాభిప్రాయాల పరిశీలన అనంతరం మార్చి నెలలో ఈ నిబంధనలకు తుది రూపు ఇవ్వనున్నట్లు వర్గాలు తెలిపాయి. ఈ మార్పులు అమల్లోకి వస్తే ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.ంది.

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 22, 2026

## కొత్త వెబ్ సిరీస్‌తో ఓటిటి వేదికపైకి మీనా



**వేద న్యూస్ డెస్క్:**

వెండితెరపై ఎన్నో హిట్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటి మీనా ఇప్పుడు డిజిటల్ వేదికపై మరో కొత్త ప్రయాణాన్ని ఆరంభించేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ ప్రధాన వెబ్ సిరీస్ రోస్లిన్ ఈ నెల 27వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో మీనా తన సినీ ప్రయాణం, వ్యక్తిగత అనుభవాలు, మారుతున్న కాలం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన బాల్య నటన రోజుల్ని గుర్తు చేసుకుంటూ అప్పట్లో ఎంత బిజీగా ఉండేదాన్నో వివరించారు. పండుగల సమయంలో కూడా ఇంట్లో ఉండే అవకాశం చాలా అరుదుగా దక్కేదని, ఇతరులు ఆనందంగా వేడుకలు జరుపుకుంటుంటే తాను మాత్రం చిత్రీకరణ స్థలంలో మేకప్‌తో ఉండాల్సి వచ్చేదని చెప్పారు. ఆ సమయంలో కొన్నిసార్లు బాధ కలిగేదని, అయితే తన తల్లి చెప్పిన మాటలు ధైర్యం ఇచ్చాయని తెలిపారు. “పండుగ ఎవరైనా చేసుకుంటారు, కానీ వందల మందితో కలిసి పనిచేసే అవకాశం కొందరికే దక్కుతుంది” అన్న తల్లి మాటలతో సెట్‌నే తన పండుగగా భావించడం ప్రారంభించానని మీనా గుర్తుచేశారు.

## ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ ఓటిటి విడుదల ఖరారు

**వేద న్యూస్ డెస్క్:**



మాస్ రాజాగా అభిమానులు సంబోధించే రవితేజ నటించిన భర్త మహాశయులకు విజ్ఞప్తి ఓటిటి విడుదల కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు శుభవార్త అందింది. థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ వేదికపైకి రానున్న ఈ చిత్రం అనూహ్య కారణాల వల్ల ఆలస్యమవడంతో అభిమానుల్లో గందరగోళం నెలకొంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా త్వరలోనే జీ5 వేదికగా ప్రసారం కానుంది. డిజిటల్ విడుదల ఆలస్యానికి ప్రధాన కారణం ఇతర భాషల అనువాద పనులేనని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల చేయాలని వేదిక నిర్వాహకులు నిర్ణయించినట్లు సమాచారం. బహుభాషా వ్యూహంతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకోవాలన్నదే ఈ నిర్ణయానికి కారణమని సినీ వర్గాలు చెబుతున్నాయి. థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించిన ఈ చిత్రం ఇప్పుడు ఓటిటి ద్వారా మరింత విస్తృత వర్గానికి చేరనుంది.

## శ్రీ విష్ణు ‘విష్ణు విన్యాసం’ ఫిబ్రవరి 27నే థియేటర్లలోకి

**వేద న్యూస్ డెస్క్:**




కథలను నమ్మి సినిమాలు చేసే నటుల్లో ముందువరుసలో నిలిచే శ్రీ విష్ణు తాజాగా నటిస్తున్న చిత్రం ‘విష్ణు విన్యాసం’. వినోద ప్రధాన చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు విడుదలకు ముందే మంచి ఆసక్తి నెలకొంది. ఒంగోలు నేపథ్యంతో సాగే ఈ కథలో శ్రీ విష్ణు ‘చిన్నా’ అనే పాత్రలో కనిపించనున్నాడు. జాతకాలు, వాస్తుపై అపారమైన నమ్మకం ఉన్న వ్యక్తిగా ఆయన చేసే విన్యాసాలు కథను ముందుకు నడిపిస్తాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌లో ఆయన యాస, సంభాషణలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో నయన్ సారిక కథానాయికగా నటిస్తోంది. వినోదాన్ని ప్రధానంగా తీసుకుని తెరకెక్కిన ఈ సినిమాను మొదట ఫిబ్రవరి 28న విడుదల చేయాలని ప్రకటించారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఒక రోజు ముందుగానే, ఫిబ్రవరి 27న థియేటర్లలోకి తీసుకురానున్నారు. “జాతకం ప్రకారం ముందే నవ్వుల వర్షం” అంటూ చిత్రబృందం కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ప్రేక్షకుల జాతకంలో నిరంతర వినోద దోషం మొదలవుతుందనే ఆకర్షణీయమైన వ్యాఖ్యతో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఈ చిత్రానికి రాధన్ సంగీతాన్ని అందిస్తున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. ఇదే రోజున విడుదల కావాల్సిన శ్రీ విష్ణు నటించిన ‘మృత్యుంజయ్’ చిత్రం మాత్రం మార్చి 6కు వాయిదా పడింది. దీంతో ఫిబ్రవరి 27న థియేటర్లలో నవ్వుల సందడి ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## ప్రెగ్నెన్సీ సమయంలోనే షూటింగ్..

**వేద న్యూస్ డెస్క్:**



మెగా కుటుంబ కోడలిగా గుర్తింపు పొందిన లావణ్య త్రిపాఠి వివాహానంతరం కూడా తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తూ వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంటోంది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలో నటించిన సతీ లీలావతి చిత్రం మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా చిత్రబృందంతో కలిసి యాంకర్ సుమ కనకాల తో నిర్వహించిన ప్రత్యేక సంభాషణలో లావణ్య తన గర్భధారణ సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకోవడం విశేషంగా మారింది. కొన్ని నెలల క్రితమే పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఆమె, ఈ చిత్రానికి సంబంధించిన ప్రధాన చిత్రీకరణను తాను గర్భవతిగా ఉన్నప్పుడే పూర్తి చేశానని వెల్లడించింది. చిత్రీకరణ ప్రారంభమైన తర్వాత మధ్యలో విరమిస్తే నిర్మాతలకు నష్టం కలుగుతుందని భావించి, వైద్యుల హెచ్చరికలున్నప్పటికీ జాగ్రత్తలతో ముందుకు సాగానని ఆమె తెలిపింది. గర్భధారణ ప్రారంభ దశలోనే షూటింగ్ ఉండటంతో శారీరక అసౌకర్యాలు ఎక్కువగా ఉండేవని, వాంతులు వచ్చిన రోజుల్లో కూడా తక్కువ విరామంతో సెట్స్‌కు హాజరయ్యేదాన్నని చెప్పింది. మైగ్రేన్ సమస్య కారణంగా తీవ్ర తలనొప్పులు వచ్చినప్పటికీ వైద్యుల సూచనల మేరకు మాత్రలు తీసుకుని చిత్రీకరణలో పాల్గొన్నానని వెల్లడించింది. ప్రతి షెడ్యూల్ పూర్తయ్యాక ఆసుపత్రికి వెళ్లి శిశువు ఆరోగ్యం సరిగా ఉందో లేదో నిర్ధారించుకునేదాన్నని చెప్పింది. యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాల్సిన సందర్భాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించామని, ప్రమాదకరమైన కదలికలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొంది. నృత్య సన్నివేశాల సమయంలో కొరియోగ్రాఫర్ తన పరిస్థితిని అర్థం చేసుకుని ఒత్తిడి తక్కువగా ఉండేలా అడుగులు రూపొందించారని తెలిపింది. గర్భధారణ లక్షణాలు బయటపడకుండా దుస్తులను ప్రత్యేకంగా రూపొందించారని, కెమెరా కోణాలు కూడా జాగ్రత్తగా ఎంపిక చేశారని వివరించింది. మూడు నెలల వ్యవధిలో ప్రధాన చిత్రీకరణ పూర్తయ్యేలా బృందం సమన్వయం చేసుకుందని చెప్పింది. వైద్యులు ఎక్కువ ప్రయాణాలు చేయవద్దని సూచించినప్పటికీ చిత్రీకరణ రామోజీ ఫిలిం సిటీలో జరగడంతో ప్రతిరోజూ తెల్లవారుజామునే బయలుదేరాల్సి వచ్చేదని, అది కొంత కష్టంగా అనిపించేదని వెల్లడించింది. గర్భధారణ విషయం మొదట్లో అందరికీ తెలియకుండా ఉంచానని, తెలిసిస్తే ప్రత్యేక శ్రద్ధ చూపుతారని భావించి చెప్పలేదని తెలిపింది. అనంతరం పరిస్థితి స్పష్టమైన తర్వాత చిత్రబృందం పూర్తి మద్దతు అందించిందని చెప్పింది. కుటుంబ సభ్యులు మొదట ఆందోళన చెందినప్పటికీ, ముఖ్యంగా తన భర్త వరుణ్ తేజ్ అండగా నిలిచారని పేర్కొంది. గర్భధారణ సమయంలోనూ బాధ్యతను ముందుంచి సినిమా పూర్తి చేయాలన్న తపనతో పనిచేసిన లావణ్యపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. మాతృత్వాన్ని ఆనందంగా ఆస్వాదిస్తూ వృత్తిపరమైన కట్టుబాట్లను సమతుల్యం చేసిన ఆమె ప్రయత్నం పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ‘సతీ లీలావతి’ విడుదల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, ఈ చిత్రం ఆమెకు మరో మంచి విజయాన్ని అందిస్తుందేమో అన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

## సూపర్ 8లోనూ సంజూ బెంచ్‌పైనే..


**వేద న్యూస్ డెస్క్:**



భారత జట్టులో స్థానం దక్కించుకోవాలంటే ప్రతిభ మాత్రమే కాకుండా అవకాశాలను సద్వినియోగం చేసుకునే సామర్థ్యమూ అవసరమనే విషయాన్ని మరోసారి గుర్తుచేస్తోంది సంజూ శాంసన్ పరిస్థితి. ద్వైపాక్షిక సిరీస్‌ల్లో, ఐపీఎల్ పోటీల్లో అద్భుత ప్రదర్శనలు చేసిన సంజూ శాంసన్ టీ20 ప్రపంచకప్‌లో మాత్రం బెంచ్‌కే పరిమితమవుతున్నాడు. సూపర్ 8 దశలోనైనా అవకాశం వస్తుందేమోనని అభిమానులు ఆశించినా, తొలి మ్యాచ్‌లో అతడిని ఆడించడం లేదని భారత సారథి సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తుది జట్టు కూర్పుపై మీడియా సమావేశంలో మాట్లాడిన సూర్యకుమార్ యాదవ్, వరుసగా విఫలమవుతున్న అభిషేక్ శర్మ స్థానంలో సంజూ శాంసన్‌ను తీసుకునే ఆలోచన లేదని పేర్కొన్నారు. ఓపెనర్‌గా ఎంపికైన అభిషేక్ శర్మ సన్నాహక సిరీస్‌లో న్యూజిలాండ్‌పై ఘోరంగా విఫలమయ్యాడు. అస్వస్థత కారణంగా ఒక మ్యాచ్ మిస్ అయినా, తిరిగి బరిలోకి దిగినప్పుడు కూడా పరుగులేకుండా ఔటయ్యాడు. మరోవైపు ఇషాన్ కిషన్ దూకుడైన ఆటతో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. అభిషేక్ వరుసగా మూడు సార్లు పరుగులేకుండా ఔటవ్వడం విశ్లేషకుల దృష్టిని ఆకర్షించింది. టాప్ ఆర్డర్‌లో కుడిచేతి బ్యాటర్ అవసరమని, అందుకు సంజూ శాంసన్ సరైన ఎంపిక అవుతాడని సూచనలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ, ఒకరిని తప్పించి మరొకరిని చేర్చే నిర్ణయానికి జట్టు యాజమాన్యం సిద్ధంగా లేదని సంకేతాలు లభిస్తున్నాయి. ‘సూపర్ 8లోనైనా సంజూ జట్టులో ఉంటాడా?’ అన్న ప్రశ్నకు సూర్యకుమార్ యాదవ్ తెలివిగా స్పందిస్తూ, ‘అభిషేక్‌ను తప్పించాలా? లేక తిలక్ వర్మ స్థానంలో సంజూను మూడో స్థానంలో ఆడించాలా?’ అని ఎదురు ప్రశ్నించారు. లీగ్ దశలో ప్రస్తుత టాప్ ఆర్డర్ కలయిక బాగా పనిచేసిందని, మార్పులకు ఆస్కారం లేదని స్పష్టం చేశారు. దీంతో సూపర్ 8 దశలోనైనా అవకాశం దక్కుతుందన్న ఆశతో ఉన్న సంజూ శాంసన్ కు మరోసారి నిరాశే ఎదురవుతోంది. గత సంచికలోనూ తుది జట్టులో చోటు దక్కని కేరళ బ్యాటర్, ఈసారి కూడా బెంచ్‌కే పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

## పవర్‌ఫుల్ షాట్ కొట్టిన హార్దిక్ పాండ్యా..తీవ్రంగా గాయపడ్డ ఇండియన్ బౌలర్

**వేద న్యూస్ డెస్క్:**



టీ20 ప్రపంచకప్‌కు సిద్ధమవుతున్న భారత జట్టును గాయాల సమస్య వెంటాడుతోంది. తాజాగా అహ్మదాబాద్‌లో జరిగిన సాధన సమయంలో కీలక ఘటన చోటుచేసుకుంది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కొట్టిన బలమైన షాట్ నేరుగా వేగబౌలర్ మొహమ్మద్ సిరాజ్ మోకాలికి తగలడంతో ఆయన గాయపడ్డాడు. బంతి తీవ్ర వేగంతో తగలడంతో సిరాజ్ నొప్పితో ఇబ్బంది పడినట్లు జట్టు వర్గాలు తెలిపాయి. వెంటనే వైద్య సిబ్బంది పరిశీలించి చికిత్స అందించారు. టోర్నీ ప్రారంభానికి ముందు గాయపడిన హర్షిత్ రాణా స్థానంలో చివరి నిమిషంలో సిరాజ్‌కు అవకాశం లభించింది. గ్రూప్ దశలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించాడు. అనంతరం జరిగిన మ్యాచ్‌లలో జస్ప్రీత్ బుమ్రా (జస్ప్రీత్ బుమ్రా), అర్షదీప్ సింగ్ (అర్షదీప్ సింగ్)లకు ప్రాధాన్యం ఇచ్చారు. సూపర్ ఎనిమిది దశలో వరుణ్ చక్రవర్తి కీలకంగా మారనున్నట్లు భారత బౌలింగ్ శిక్షకుడు మోర్నీ మోర్కెల్తె లిపారు. ఆదివారం దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనున్న నేపథ్యంలో జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొంది. సిరాజ్ గాయ తీవ్రతపై వైద్య బృందం నివేదిక ఇచ్చిన తరువాతే అతని అందుబాటు పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## టీ20 సిరీస్ భారత్ మహిళలదే

### – ఆఖరి మ్యాచ్‌లో ఆసీస్ చిత్తు..



**వేద న్యూస్ డెస్క్:**

మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా అడిలైడ్‌లో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత మహిళా జట్టు ఘన విజయం సాధించింది. 17 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా మహిళా జట్టును ఓడించి సిరీస్‌ను 2–1 తేడాతో కైవసం చేసుకుంది. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 159 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు కంగారూ బ్యాటర్లు నిలబడలేకపోయారు. ఆష్లీ గార్డ్‌నర్ 45 బంతుల్లో 57 పరుగులతో అర్ధశతకం సాధించి పోరాడినా, మిగతా బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 26, జార్జియా వాల్ 10, తహ్లియా వారేహం 12, అనెబెల్ సదర్లాండ్ 14 పరుగులు మాత్రమే చేశారు. గ్రేస్ హ్యారిస్, ఎలీస్ పెర్రీ ఒక్కో పరుగుకే వెనుదిరిగారు. బెత్ మూనీ 6, సోఫీ మోలిన్యూ 6 పరుగులతో నిరాశపరిచారు. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్, శ్రీచరణి చెరో మూడు వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపుతిప్పారు. అరుంధతీ రెడ్డి రెండు వికెట్లు సాధించగా, రేణుకా సింగ్ ఒక వికెట్ తీశారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ మహిళలు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేశారు. స్మృతి మంధాన 55 బంతుల్లో 82 పరుగులు చేసి అద్భుతంగా ఆడింది. జెమీమా రోడ్రిగ్స్ 46 బంతుల్లో 59 పరుగులతో కీలక భాగస్వామ్యం అందించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో అనెబెల్ సదర్లాండ్ రెండు వికెట్లు సాధించగా, సోఫీ మోలిన్యూ, కిమ్ గాత్ తలా ఒక వికెట్ తీశారు. ఈ విజయంతో భారత మహిళా జట్టు విదేశీ నేలపై మరో సిరీస్‌ను సొంతం చేసుకుని విశ్వాసాన్ని పెంచుకుంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073